epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:41

24 క్యారెట్లు 152,570.00 | కిలో వెండి 2,50,000.00 | chourastha Digitals | 27.09.2026 ఆదివారం, హైదరాబాద్

## టీనేజర్లకు డ్రగ్స్ ముప్పు

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్
- సమగ్ర పునరావాసం అవసరం
- పిల్లలు డ్రగ్స్ బారిన పడటానికి గల కారణాలను గుర్తించాలి
- పిల్లల రక్షణ కేవలం రెస్క్యూ చేయడంతోనే ఆగిపోకూడదు
- చికిత్స, డిశ్చార్జ్ తర్వాత సుస్థిరమైన పునరావాస వ్యవస్థను నిర్మించాలి
- డ్రగ్స్‌ను సరఫరా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలి
- పాఠశాలలే పిల్లలకు క్రమశిక్షణను, భవిష్యత్తుపై భరోసానిస్తాయి



దేశంలో ఉన్న టీనేజర్స్‌లో 20 శాతానికి పైగా మంది మాదకద్రవ్యాల బారిన పడే ముప్పును ఎదుర్కొంటున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్నాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు.

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**
డ్రగ్స్ ఉచ్చులో చిక్కుకున్న పిల్లలను కేవలం రికార్డుల్లో గణాంకల్లా చూడకూడదన్నారు. వారిని ఆ మార్గంలోకి నెట్టిన విభిన్న పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి తమ బాల్యాన్ని తిరిగిచ్చే పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆగస్టులో ప్రముఖ జర్నల్ 'లాన్సెట్ రీజినల్ హెల్త్ సౌత్‌ఈస్ట్ ఆసియా' ప్రచురించిన ఒక అధ్యయనాన్ని సీజేఐ ప్రస్తావించారు. దేశంలోని ప్రతి ఐదుగురు

।మిగతా 2 లో।



## ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో పోటీలో ఉంటాం

- టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కవిత
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారానికే పరిమితమైంది
- ప్రచార ఆర్భాటం తప్ప చేసిందేమీ లేదు
- పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే
- ఇదంతా నాయకుల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాల్లో భాగమే

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
తెలంగాణ రక్షణ సేన (TRS) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని, ప్రచార ఆర్భాటం తప్ప చేతల్లో మాత్రం చేసిందేమీ లేదని

।మిగతా 2 లో।

## హుజూరాబాద్‌కూ ఉపఎన్నిక...?

### పాడి కౌశిక్ రెడ్డి లక్ష్యంగా బిగ్ ప్లాన్

- దానం నాగేందర్ అనర్హత తర్వాత
- పాడి కౌశిక్ రెడ్డిపై ప్రివిలేజ్ కమిటీ విచారణపై చర్చ
- అనర్హతా వేటు పడితే ఒకేసారి రెండు ఉపఎన్నికలు
- కౌశిక్ రెడ్డిపై శాసనసభా హక్కులు,
- ప్రవర్తనా నియమావళి కమిటీల ద్వారా విచారణను వేగవంతం
- వివరణకు ఆరు వారాల గడువు కోరిన పాడి కౌశిక్ రెడ్డి
- వివరణ తరవాత సభ నుంచి అనర్హత వేటు వేసే దిశగా ప్రతిపాదనలు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
తెలంగాణ రాజకీయం ప్రస్తుతం అనర్హత పోట్లు, సవాలక్ష వ్యూహాలతో అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతోంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అస్త్రంగా సుప్రీంకోర్టు దాకా న్యాయపోరాటం చేసి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయించడంలో బిఆర్ఎస్ అధిష్ఠానం విజయం సాధించి ఒక కీలక అంకానికి తెరలేపింది. దీనితో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. అయితే, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ఈ దెబ్బకు రక్షణా

।మిగతా 2 లో।





## మోదీకి సీఎం విజ్ఞప్తి

# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

### పరిపాలనలో మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలు గొప్పవి

- మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా అందరికి స్ఫూర్తిదాయకం
- విద్యాహక్కు, సమాచారహక్కు, ఉపాధిహామీ చట్టాలు మన్మోహన్‌సింగ్ తెచ్చినవే.
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఆవిష్కరణ





పరిపాలనలో మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలు చాలా గొప్పవన్న సీఎం రేవంత్‌రెడ్డి భారతదేశం గర్వించదగిన జాతిరత్నం డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వకపోవటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోని విప్రో సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్‌సింగ్ స్మారక పార్క్ ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు

।మిగతా 2 లో।

## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం

- 19 మంది దుర్మరణం, 3వేల సీసాలు సీజ్
- కల్తీ మద్యం మూలాలపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు
- గుర్తుతెలియని, లేబుల్ లేని మద్యాన్ని సేవించవద్దు
- ప్రజలకు పోలీసు అధికారులు సూచనలు

2లో



## ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే అధికారం

- అన్ని సర్వేలు ఇదే చెప్తున్నాయి
- రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు ఇబ్బందులు
- ఎన్నికల హామీలను గాలికొదిలేసింది
- ప్రజలు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నారు
- కేసీఆర్ ఉన్నప్పుడు సమయానికి రైతు బంధు పడేది
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టింది
- గణేశ్ నిమజ్జనాల్లో ఊరు ఊరున కేసీఆర్ పాటలే పెట్టారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**
తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ అధికారంలో రావడం ఖాయమని అన్ని సర్వేలు చెబుతున్నాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు నేతలు హైదరాబాద్ తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనతో ప్రజలు బాధపడుతున్నారన్న కేటీఆర్ రైతులకు రైతు బంధు, కనీసం యూరియా ఇవ్వలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఎన్నికల హామీలను


।మిగతా 2 లో।



## ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో ఇద్దరు మృతి.. 11 మంది గాయాలు
- టైర్ పేలడంతో పల్టీలు కొట్టిన ఆటో
- మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వలస కూలీలుగా
- పోలీసుల ప్రాథమిక అంచనా

2లో



హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో ప్రయాణిస్తున్న అశోక్ లేలాండ్ ఆటో వెనుక వైపు టైర్ హఠాత్తుగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపైనే పల్టీ కొట్టింది. ఈ ప్రమాదలో ఇద్దరు కూలీలు మృతిచెందగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ORR పై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన జరిగిన సమయంలో కూలీలు కీసర నుంచి షామీర్‌పేట్ వైపు ఆటోలో వెళ్తున్నారు. **తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో**

# మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

తరువాయి భాగం

హాజరయ్యారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా అన్ని తరాలకు ఒక స్ఫూర్తి అని సీఎం తెలిపారు. మారుమూల గ్రామం నుంచి ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ వరకు మన్మోహన్‌సింగ్ విద్యాభ్యాసం సాగిందని, తన చదువు, విజ్ఞానం అంతా దేశానికే ఉపయోగపడాలని భావించి భారత్‌కు తిరిగివచ్చారని గుర్తు చేశారు. మన్మోహన్‌సింగ్, పీవీ నర్సింహారావు ఆలోచనల ఫలితమే సరళీకృత ఆర్థిక విధానమని, ఆనాడు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయని, ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయని కొనియాడారు.




దేశం విషయానికి వస్తే నెహ్రూ సర్దార్ వల్లాభాయ్ పటేల్ జోడీ శాశ్వతంగా నిలిచిపోతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ విషయంలో మన్మోహన్‌సింగ్, సోనియాగాంధీ పేర్లు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని, ఆర్థికంగానే కాదని రాజకీయంగా కూడా దేశం కొన్నాళ్లు సంక్షోభాన్ని ఎదుర్కొన్నదని, దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ దేశ పగ్గాలు చేపట్టారని వెల్లడించారు.

మన్మోహన్‌సింగ్ సరళీకృత ఆర్థికవిధానాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక పరిజ్ఞానం తెలిసి పీవీ నర్సింహారావు బాధ్యతలు ఇచ్చారని, మన్మోహన్‌సింగ్‌ను ఎకనమిక్స్ టైమ్స్ ఎకనమిక్ ఫైటర్‌గా వర్ణించిందని గుర్తు చేశారు.

"విద్యాహక్కు, సమాచారహక్కు, ఉపాధిహామీ చట్టాలు మన్మోహన్‌సింగ్ తెచ్చినవే. అసోం నుంచి రాజ్యసభకు ఎన్నికైనప్పుడు మన్మోహన్‌సింగ్ ఎన్నిక చెల్లదని కేసు వేశారు. ఆ కేసుపై సుప్రీంకోర్టులో తన తరపున వాదించేందుకు న్యాయవాది అవసరమైంది. న్యాయవాదికి ఫీజు చెల్లించేంత డబ్బు తన వద్ద లేదని ఆనాడు మన్మోహన్ సింగ్ అన్నారు. ఒక న్యాయవాది ఉచితంగా వాదించేందుకు ముందుకు వస్తేనే మన్మోహన్‌సింగ్ కోర్టులో పిటిషన్ వేశారు" జస్టిస్ ఎన్వీ రమణ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి తెలంగాణ ఏర్పాటు ప్రధాన కారకులలో మన్మోహన్‌సింగ్ ఒకరన్న హైదరాబాద్‌లో మన్మోహన్‌సింగ్ స్మారకపార్క్ ఏర్పాటు చేసుకోవటం ఆనందంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. దేశాభివృద్ధికి మన్మోహన్‌సింగ్ చేసిన కృషి దేశమంతటికి తెలుసనని, ఆర్థికశాఖ కార్యదర్శి, ఆర్థికశాఖ మంత్రి, ప్రధానిగా దేశానికి విశేష సేవలు అందించారని కొనియాడారు.



## ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్‌దే అధికారం

తరువాయి భాగం

గాలికొదిలేసి, ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రేవంత్ రెడ్డి రైతుబంధు ఎగ్గొట్టిన ప్రతిసారీ ప్రజలు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు.పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారన్న కేటీఆర్ పని చేసే ప్రభుత్వానికి కాళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే కేసీఆర్ బయటికి రావట్లేదని తెలిపారు. మూడు సంవత్సరాల కేసీఆర్ బయటికి రాకపోయినా ఆదరణ తగ్గలేదని తెలిపారు. కేసీఆర్ బయట కనిపించకపోయినా ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారని, కేసీఆర్ ఉన్నప్పుడు సమయానికి రైతు బంధు పడేదని ప్రజలు అనుకుంటున్నారని వెల్లడించారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు గెలిచినా పథకాలు ఆగవని భావించి బీఆర్‌ఎస్‌ను ఓడించారని పేర్కొన్నారు.

"రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన రెండు వాగ్దానాలను నిలబెట్టుకున్నారు. ఒకటి మేము మోసం చేస్తాం. ప్రజలు మోసపోవాలనే కోరుకుంటారని అందుకే మోసగాళ్లనే ఎన్నుకుంటారని చెప్పారు. రెండోది వెనకటి రోజులు తీసుకొస్తా అన్నారు. తీసుకొచ్చారు. కరెంట్ కోతలు మొదలయ్యాయి. రేవంత్ రెడ్డి నిజాయితీ గల మోసగాడు. ఓటర్లు పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారు. ఎన్నికలైన తర్వాత కేసీఆర్ మూడు, నాలుగు సార్లే బయటకు వచ్చారు. కేసీఆర్ అన్ని గమనిస్తున్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను మర్చిపోలేదు. గణేశ్ నిమజ్జనాల్లో ఊరు ఊరున కేసీఆర్ పాటలే పెట్టారు. ఏ ఊరికి పోయిన కేసీఆర్ పేరే వినిపిస్తోందని బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.ప్రజా సమస్యలపై తమ పోరాటంలో ఎలాంటి వెనకడుగు లేదని కేటీఆర్ తెలిపారు. ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

## నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం

తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :

మద్యపాన నిషేధం అమల్లో ఉన్న నాగాలాండ్‌లో కల్తీ మద్యం సేవించి 19 మంది ప్రాణాలు కోల్పోయారు. రెండ్రోజుల్లో మోకోక్‌చుంగ్ జిల్లాలో 8 మంది, ట్యూన్‌సాంగ్ జిల్లాలో 11 మంది మృత్యువాత పడ్డారు. రాష్ట్రంలో 1990 నుంచే మద్యపాన నిషేధం ఉన్నప్పటికీ ఈ దుర్ఘటన జరగడం కలకలం రేపుతోంది. వరుస మరణాల నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం, కల్తీ మద్యం సరఫరా, దాని మూలాలను గుర్తించేందుకు సిట్ ఏర్పాటు చేసింది. పోలీసులు పలుచోట్ల దాడులు నిర్వహించి 19 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 3000 కల్తీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం, మృతదేహాల అవయవాల నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం గువాహటికి పంపించారు.గుర్తుతెలియని, లేబుల్ లేని మద్యాన్ని సేవించవద్దని పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు. మద్యం సేవించిన తర్వాత తల తిరగడం, దృష్టి మసకబారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.ఇదిలా ఉండగా, ఇటీవల మధ్యప్రదేశ్‌లో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించిన వారిలో 37 మంది రోగులకు కంటి సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు, వైద్యులు తెలిపారు. వారంరోజుల క్రితం, విషపూరిత మద్యం సేవించి 13 మంది మృతి చెందినట్లు జిల్లా యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరినప్పటికీ, మృతుల సంఖ్య 50కి పైగా ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అధికారుల ప్రకారం, కలుషితమైన మద్యం సేవించిన తర్వాత దాదాపు 15 మంది ఆసుపత్రిలో చికిత్స పొందారని, వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. అయితే, కల్తీ మద్యం ప్రభావం కారణంగా ప్రాణాలతో బయటపడిన వారు కంటిచూపు కోల్పోతుండటాన్ని వైద్యులు, పారామెడికల్ సిబ్బంది తెలుసుకున్నారని అధికారులు చెప్పారు. దీంతో నాసిరకం మద్యం వల్ల ప్రభావితమైన వారి కోసం బందా, షాఘర్ బ్లాక్‌లలోని 10 ప్రభావిత గ్రామాల్లో స్థానిక యంత్రాంగం ప్రత్యేక పరీక్షా శిబిరాలను నిర్వహించింది."మొత్తం 226 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా, 37 మంది రోగులకు కంటి సంబంధిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. మరో 189 మందికి వివిధ ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధరణ జరిగింది. జిల్లా యంత్రాంగం గుర్తించిన గ్రామాల్లో ఏడు రోజుల పాటు ఈ శిబిరాలను ఏర్పాటు చేశాం" అని చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (సీఎంహెచ్ఓ) డాక్టర్ దేవేశ్ పటేరియా తెలిపారు. బందా బ్లాక్‌లోని పటాన్, చౌకా, బమురా, ఛప్రితో పాటు షహగర్ బ్లాక్‌లోని నౌరాజ్, గుగ్రా ఖుర్ద్, దిలోనా, ఖటోరా ఖుర్ద్, బుధ్నా, ఘుర్మార్‌లతో సహా అనేక ప్రాంతాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. బుందేల్‌ఖండ్ మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న వారిలో, తీవ్రమైన దృష్టి సమస్యలతో బాధపడుతున్న ముగ్గురు రోగులను ప్రత్యేక చికిత్స కోసం బోపాల్ ఎయిమ్స్‌కు పంపించినట్లు డాక్టర్ పటేరియా పేర్కొన్నారు. కొంతమంది బాధితులు కల్తీ మద్యం సేవించామో లేదో స్పష్టంగా ధ్రువీకరించడానికి సంకోచిస్తున్నారని వైద్యులు పేర్కొన్నారు.

## ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో ప్రయాణిస్తున్న అశోక్ లేలాండ్ ఆటో వెనుక వైపు టైర్ హఠాత్తుగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపైనే పల్టీ కొట్టింది. ఈ ప్రమాదలో ఇద్దరు కూలీలు మృతిచెందగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ORR పై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన జరిగిన సమయంలో కూలీలు కీసర నుంచి షామీర్‌పేట్ వైపు ఆటోలో వెళ్తున్నారు.పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్తున్న వారి జీవితాలు రోడ్డు ప్రమాదంతో తెల్లారిపోయాయి. ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. మృతులను మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వలస కూలీలుగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న కీసర పోలీసులు వెంటనే అక్కడికి స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన కూలీలను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టీనేజర్లకు డ్రగ్స్ ముప్పు

తరువాయి భాగం

టీనేజర్లలో ఒకరి కంటే ఎక్కువ మంది మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ అధ్యయనం అంచనా వేసిందనట్లు చెప్పారు. ఈ సమస్య టీనేజర్ల వర్గానికి మాత్రమే పరిమితమైనది కాదన్నారు. యువత అవసరాలను గుర్తించి దీన్ని నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. డ్రగ్స్ బారిన పడిన పిల్లల గురించి గణాంకాలు చెప్పడం ఎంత ముఖ్యమో, వారి బాధలను అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యమని సీజేఐ సూచించారు. ఒకరు బాధితుడు కావడానికి రకరకాల కారణాలు ఉంటాయని చెప్పారు. చెడు స్నేహాలు, ఇంట్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం, ఆశ్రయం లేకపోవడం, వేధింపులు లేదా డ్రగ్స్ ఉండే వాతావరణంలో పెరగడం వంటి రకరకాల కారణాల వల్ల చదవుకు దూరమై పిల్లలు ఈ చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని చెప్పుకొచ్చారు. డ్రగ్స్ బారిన పడే మార్గాలు వేర్వేరుగా ఉన్నప్పుడు, వాటి పరిష్కరానికి అనుసరించే విధానాలు కూడా విభిన్నంగా ఉండాలని సీజేఐ సూచించారు. ఒక సమస్యతో తమ ముందుకు వచ్చిన పిల్లలను ఆ కోణంలోనే చూడకూడదన్నారు. పిల్లల రక్షణ కేవలం రెస్క్యూ చేయడంతోనే ఆగిపోకూడదన్నారు. చికిత్స, డిశ్చార్జ్ తర్వాత సుస్థిరమైన పునరావాస వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ, తమ స్వార్థం కోసం పిల్లల భవిష్యత్‌ను నాశనం చేస్తున్న నేరస్థుల పట్ల చట్టం అత్యంత కఠినంగా, సత్వరమే స్పందించాలని జస్టిస్ సూర్యకాంత్ తేల్చిచెప్పారు. అయితే, బాధితులైన పిల్లలను చూసే కోణం మారలన్నారు. వారి భద్రత, వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం ప్రధానాంశాలుగా కావాలన్నారు. బాల్యాన్ని వారికి తిరిగి ఇవ్వడం అంటే గడియారాన్ని వెనక్కి తిప్పడం కాదన్నారు. మళ్లీ తమ బాల్యాన్ని, విద్యను, మంచి సంబంధాలను, ఆటపాటలను, భవిష్యత్తుపై నమ్మకాన్ని అనుభవించేలాంటి అనుకూల వాతావరణాన్ని కల్పించడమని సీజేఐ చెప్పారు.డ్రగ్స్ బారిన పడిన పిల్లలను గుర్తించి వారిని పూర్వ స్థితికి తీసుకొచ్చే విషయంలో అన్ని కోణాల్లో దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా సీజేఐ చెప్పారు. తొలి దశలో గుర్తింపు అనేది చాలా కీలకమన్నారు. ఇది వీలైనంత త్వరగా ప్రారంభం కావాలన్నారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కమ్యూనిటీ వర్కర్లు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను మొదటగా గమనించాలన్నారు. ఆ తర్వాత చికిత్స అంశమన్నారు. డీఅడిక్షన్ అనేది కేవలం వైద్య చికిత్సతో ముగిసిపోదని సీజేఐ అన్నారు. దానికి మానసిక ఆరోగ్య సహాయం, సురక్షితమైన జీవన వాతావరణం, కుటుంబం, పిల్లలతో నిరంతర సంభాషణ అవసరమన్నారు. అలాగే, విద్య అనేది చాలా కీలకమమని సీజేఐ అన్నారు. ప్రమాదకర వాతావరణం నుంచి ఒక చిన్నారిని రక్షించినప్పటికీ, చదువుకు దూరం చేస్తే అది మరో ప్రమాదంలోకి నెట్టడమే అవుతుందన్నారు. పాఠశాలలే పిల్లలకు క్రమశిక్షణను, భవిష్యత్తుపై భరోసానిస్తాయని సీజేఐ సూచించారు. పునరావాసంలో కుటుంబం ఇచ్చే భరోసా చాలా కీలకమని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఒకవేళ కుటుంబమే హింసకు, నిర్లక్ష్యానికి కేంద్రమైతే ఆ పిల్లలను అక్కడికే పంపడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డులు ఈ విషయంలో పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పునరావాసంలో అత్యంత సులభంగా నిర్లక్ష్యానికి గురవుతున్న దశ చికిత్స అనంతర సంరక్షణ అని జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు.

## హుజూరాబాద్‌కూ ఉపఎన్నిక...?

తరువాయి భాగం



త్మక ధోరణిలోకి వెళ్లకుండా, వెంటనే మైండ్ గేమ్‌తో ఎదురుదాడికి దిగింది. ఇందులో భాగంగానే హుజూరాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని టార్గెట్ చేస్తూ శాసనసభ హక్కులు, ప్రవర్తనా నియమావళి కమిటీల ద్వారా విచారణను వేగవంతం చేసింది.

అసలు హుజూరాబాద్ నియోజకవర్గానికి కూడా ఉపఎన్నిక వచ్చేలా కాంగ్రెస్ వ్యూహం పన్నడానికి ప్రధాన కారణం పాడి కౌశిక్ రెడ్డిపై అసెంబ్లీలో వచ్చిన ఆరోపణలే. గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గనుల అక్రమాలపై చర్చ జరుగుతున్న సమయంలో, బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రసంగాన్ని కౌశిక్ రెడ్డి అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. నువ్వు ఏ పార్టీలో ఉన్నావు అని ప్రశ్నించడమే కాకుండా, సభలోనే దుర్భాషలాడుతూ తుపాకీతో కాలుస్తానన్నట్లుగా చేతులతో బెదిరింపు హావభావాలు చూపించారని కాంగ్రెస్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీనిని సభా ధిక్కరణగా, ప్రజాప్రతినిధికి ఉండాల్సిన ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా పరిగణిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ వ్యవహారాన్ని రేవూరి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలోని ఎథిక్స్ ప్రివిలేజ్ కమిటీకి విచారణ నిమిత్తం పంపించారు.ఈ కమిటీ హుజూరాబాద్ ఎమ్మెల్యేపై మోపిన ఆరోపణలపై వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ, అసెంబ్లీ సిసిటివి ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తోంది. కౌశిక్ రెడ్డికి తన వివరణ ఇచ్చుకునేందుకు ఆరు వారాల గడువుకోరారు. వివరణ తరవాత సభ నుంచి అనర్హత వేటు వేసే దిశగా ప్రతిపాదనలు చేసే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. అసెంబ్లీలో శాసనసభ్యుల ప్రవర్తన హద్దులు దాటినప్పుడు తీవ్రమైన చర్యలు తీసుకునే అధికారం శాసనసభకు ఉంటుందనే పాయింట్‌ను కాంగ్రెస్ ఇక్కడ బలంగా వాడుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ ముందస్తు ప్లాన్ వెనుక పొలిటికల్ క్యాలిక్యులేషన్ చాలా స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ఖైరతాబాద్‌లోనే ఉపఎన్నిక జరిగితే బిఆర్ఎస్ అక్కడ పూర్తి దృష్టి కేంద్రీకరించి కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకి నెట్టే ప్రమాదం ఉంది. అలా కాకుండా, ఒకేసారి హుజూరాబాద్‌కు కూడా బైఎలక్షన్ తెప్పించగలిగితే.. బిఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు ఇది వ్యూహాత్మక వేదికవుతుంది. ఉత్తర తెలంగాణలో బిఆర్ఎస్‌కు బలమైన స్థానమైన హుజూరాబాద్‌లో వారిని చిత్తు చేస్తే, గులాబీ పార్టీ మార్క్ ప్రభావం మరియు ఆత్మ విశ్వాసం రెండూ కోలుకోలేని దెబ్బ తింటాయని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

### బీఆర్ఎస్ కౌంటర్ ఏమిటి?

బిఆర్ఎస్ కూడా దీనిపై తీవ్రస్థాయిలో ఎదురు దాడి ప్రారంభించింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా పథకం ప్రకారం చేస్తున్న రాజకీయ కక్షసాధింపు అని ఆరోపిస్తోంది. తమ పార్టీకి చెందిన పదిమంది ఎమ్మెల్యేలను అక్రమంగా కాంగ్రెస్‌లోకి చేర్చుకుని ఫిరాయింపులకు పాల్పడిన ప్రభుత్వం, మైక్ ఇవ్వకుండా సభలో ప్రశ్న అడిగిన కౌశిక్ రెడ్డిపై విచారణల పేరుతో సమయాన్ని వృథా చేస్తోందని బిఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. శాసనసభా వేదికగా నియమావళి పేరుతో వేటు వేస్తే దానిపై కూడా సుప్రీంకోర్టు తలుపు తట్టేందుకు బిఆర్ఎస్ లీగల్ టీమ్ సిద్ధంగా ఉందని సమాచారం. ఖైరతాబాద్ ఉపఎన్నికతో మొదలైన ఈ అనర్హత రాజకీయం ఇప్పుడు హుజూరాబాద్ దాకా పాకింది. అసెంబ్లీ ప్రివిలేజ్/ఎథిక్స్ కమిటీ ఇచ్చే తుది నివేదిక, దానిపై స్పీకర్ తీసుకోబోయే నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో ఏ స్థాయి ఉపఎన్నికల తుఫానును సృష్టిస్తుందో వేచి చూడాలి.

## ప్రశాంతంగా నిమజ్జనోత్సవం

- విజయవంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనాలు
- ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల సమన్వయంతో పని చేశాయి
- నగరవ్యాప్తంగా 2లక్షలకుపైగా విగ్రహాలు
- గంగమ్మ ఒడికి చేరాయి..
- ట్యాంక్‌బండ్‌లోనే లక్ష విగ్రహాలు నిమజ్జనం
- 45 వేల మంది పోలీసులు,
- 141 కేంద్రాలు, 275 క్రేన్లతో పోలీసులు



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

భాగ్యనగరంలో వినాయక మహా నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం ఉదయం నుంచి నిర్విఘ్నంగా సాగిన ఈ క్రతువులో 2 లక్షలకు పైగా ప్రతిమలు గంగమ్మ ఒడికి చేరాయి. 45 వేల మంది పోలీసులు, 141 కేంద్రాలు, 275 క్రేన్లతో పోలీసు, జీహెచ్ఎంసీ సహా ఇతర శాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

### హుస్సేన్‌సాగర్‌లో లక్ష విగ్రహాలు నిమజ్జనం

దేశంలోనే ప్రత్యేక స్థానం ఉన్న భాగ్యనగరం గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగిసింది. శివారు బాలాపూర్ నుంచి నగర నడిబొడ్డున హుస్సేన్ సాగర్ వరకు భక్తుల ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. జీహెచ్ఎంసీ లెక్కల ప్రకారం రెండు రోజుల్లో 2 లక్షలకు పైగా విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరాయి. హుస్సేన్‌సాగర్ వద్దనే లక్ష విగ్రహాలు, మిగిలిన 140 కేంద్రాల్లో మరో లక్ష విగ్రహాలు నిమజ్జనమైనట్లు అధికారులు అంచనా వేశారు.

### ఏఐ డ్రోన్లతో పటిష్ఠ నిఘా

మహా నిమజ్జనానికి నాలుగు కమిషనరేట్ల పరిధిలో 45 వేల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తించారు. హైదరాబాద్ నుంచి 30 వేలు, సైబరాబాద్ నుంచి 10 వేలు, మల్కాజ్‌గిరి కమిషనరేట్ నుంచి 5 వేల మంది పోలీసులను మోహరించారు. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోనే వెయ్యి మంది పోలీసులు విధుల్లో ఉన్నారు. 20 వేల సీసీ కెమెరాలు, ఏఐ డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి డేగ కళ్లతో పర్యవేక్షించారు. పాతబస్తీ వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో 6 ర్యాపిడ్ యాక్షన్ కంపెనీల బలగాలను మోహరించారు.

### ఫేషియల్ రికగ్నిషన్‌తో అలర్ట్ చేస్తూ

హైదరాబాద్ నగరవ్యాప్తంగా 20 వేల సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించి శోభాయాత్ర మార్గాలను అనుక్షణం పర్యవేక్షించారు. 5 వేల బాడీ వోర్న్ కెమెరాలు, ఏఐ ఆధారిత డ్రోన్ల ద్వారా ఫేషియల్ రికగ్నిషన్‌తో అనుమానాస్పద వ్యక్తులు కనిపించగానే కంట్రోల్ రూంను అలర్ట్ చేశారు. డీజీపీ సీవీ ఆనంద్, కమిషనర్లు సజ్జనర్, సుమతి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

### అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం

ట్రాఫిక్ కోసం 1200 మంది సిబ్బంది విధులు నిర్వహించారు. భక్తుల భద్రత కోసం 234 మంది గజ ఈతగాళ్లు, 51 విపత్తు స్పందన బృందాలు (డీఆర్ఎఫ్) మూడు షిఫ్టుల్లో పనిచేశాయి. 6 సబ్ స్టేషన్ల నుంచి 19 ప్రత్యేక ఫీడర్ల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేశారు. ఇలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహా నిమజ్జన క్రతువును విజయవంతంగా పూర్తిచేశారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో పోటీలో ఉంటాం

తరువాయి భాగం

ఆమె విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె.. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లోల టీఆర్ఎస్ పోటీ చేస్తుందని కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసేందుకు, ప్రజల గొంతుకగా నిలిచేందుకు తమ అభ్యర్థిని బరిలోకి దించుతామని ఆమె స్పష్టం చేశారు

ప్రజా సమస్యలు, పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేటీఆర్ ఫామ్‌హౌస్ వ్యవహారం పేరిట రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. ఇదంతా నాయకుల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాల్లో భాగమేనని, ఫామ్‌హౌస్‌లపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోదని ఎద్దేవా చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేస్తామన్నారు. దానం నాగేందర్‌పై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక వచ్చింది. తమ పార్టీ తరఫున ప్రత్యక్ష రాజకీయ పోరాటానికి ఖైరతాబాద్ నియోజకవర్గాన్ని టీఆర్ఎస్ తొలి వేదికగా ఎంచుకున్నట్లు కవిత స్పష్టం చేశారు.

దానం నాగేందర్ 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి BRS పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2024 మార్చిలో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఆ పార్టీలో చేరలేదని చెబుతూనే అదే కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేశారు. భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) ప్రకారం, ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజాప్రతినిధి ఆ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నా లేదా మరొక పార్టీ బిఫామ్‌పై పోటీ చేసినా ఆ వ్యక్తి తన శాసనసభ సభ్యత్వానికి అనర్హుడవుతారు. బిఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల నామినేషన్ వేయడం ఆయనపై అనర్హత వేటుకు కారణమైంది.

### తెలంగాణ హైకోర్టు తీర్పు వివరాలు

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బిజెపి ఎమ్మెల్యే అల్లేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లను అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పరిశీలించినా.. అందులో వాస్తవం లేదంటూ డిస్మిస్ చేశారు. దాంతో వారిద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్ (చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎమ్. మోహియుద్దీన్), స్పీకర్ ఇచ్చిన ఆదేశాలను తప్పుపడుతూ 2026 సెప్టెంబర్ 18న సంచలన తీర్పునిచ్చింది. నాగేందర్ కాంగ్రెస్ ఎంపీగా నామినేషన్ వేసిన ఏప్రిల్ 23, 2024 నుంచే ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడయ్యాడని స్పష్టం చేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయినట్లుగా ప్రకటించింది. స్పీకర్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది.





బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష శుక్రవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ మేరకు కేటీఆర్ కు మొక్కను అందజేశారు.నియోజకవర్గ అభివృద్ధి,పలు సమస్యలు,యువతకు ఉపాధి అవకాశాలు,విద్యారంగం, తదితర అంశాలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.పార్టీ బలోపేతం,భవిష్యత్ కార్యాచరణ,ప్రజలతో కలిసి మరింత చురుగ్గా పని చేస్తానని తెలిపారు.యువత,విద్యార్థులు,మహిళలు,పేద వర్గాల ప్రజల సంక్షేమం కోసం అండగా ఉంటానని తెలిపారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలతో కలిసి అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు.అనంతరం దాసరి ఉష సోదరులు,స్నేహితులు ఉపాధి రంగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చేపడుతున్న అంశాలపై ఆయనకు వివరించారు.

–తెలంగాణ చౌరస్తా, పెద్దపల్లి








# ఎస్.ఆర్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో పర్యాటక దినోత్సవం,ఫుడ్ ఫెస్టివల్

**హుజురాబాద్, తెలంగాణ చౌరస్తా:**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్.ఆర్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం,ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు.హుజురాబాద్ పట్టణంలో ఎస్.ఆర్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ వరల్డ్ టూరిజం డే,ఫుడ్ ఫెస్టివల్ కు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ రౌంటాల సుహాసిని,మనోజ్ రావు,విద్యార్థులు చేసిన వరల్డ్ వండర్స్,క్యూలినరీ కాంపిటీషన్, కాక్టైల్స్,మొక్టైల్స్,ఫ్లవర్ అరెంజ్మెంట్స్,టవల్ ఆర్ట్స్, విద్యార్థులు చేసిన ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్స్ అందజేశారు.అనంతరం ఎస్ ఆర్ కాలేజ్ చైర్మన్ అనుష్ రెడ్డి,డైరెక్టర్ శ్రీజ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రపంచ పర్యాటక రంగం ప్రాముఖ్యత,వివిధ దేశాలు, ప్రాంతాల సంస్కృతి,ఆహార సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.వివిధ రకాల ఆహార పదార్థాలు ,సంప్రదాయ వంటకాలు,మాక్‌టెయిల్స్,పుష్పాలంకరణ,న్యాప్‌కిన్ ఫోల్డింగ్,టవల్ ఆర్ట్స్ వంటి కార్యక్రమాలు ఫుడ్ ఫెస్టివల్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.చైర్మన్ అనుష్ రెడ్డి మాట్లాడుతూ.... పర్యాటక రంగం భారతదేశ ఆర్థిక వ్యవస్థతో పాటు ఉపాధి అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహనతో పాటు ప్రాక్టికల్ అనుభవం ఎంతో అవసరమని పేర్కొన్నారు.డైరెక్టర్ శ్రీజా రెడ్డి మాట్లాడుతూ....ప్రపంచ పర్యాటక దినోత్సవం ద్వారా విద్యార్థులు వివిధ దేశాలు,సంస్కృతులు,ఆహార సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి అవకాశం లభించిందని తెలిపారు.విద్యార్థుల్లో సృజనాత్మకత,టీమ్ వర్క్,ప్రొఫెషనల్ నైపుణ్యాలను పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు.ముఖ్య అతిథి మున్సిపల్ చైర్ పర్సన్ రౌంటాల సుహాసిని విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ,పర్యాటక హాస్పిటాలిటీ రంగాల్లో యువతకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.విజేతలకు బహుమతులు,మెడల్స్,సర్టిఫికెట్లు అందజేశారు.విదేశీ ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు ఆఫర్ లెటర్లను అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల ప్రాంగణం వివిధ దేశాలు,సంస్కృతులు,ఆహార సంప్రదాయాల ప్రతిబింబంగా మారి పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్,సొల్లు సునీత బాబు,సందమల్ల పుణ్య బాబు,కొండ ప్రశాంతి మురళి,రాజేశ్వర్ రెడ్డి ఎస్.ఆర్ కాలేజ్ యాజమాన్యం,విద్యార్థులు, అధ్యాపకులు,సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రపంచ పర్యాటక దినోత్సవం,ఫుడ్ ఫెస్టివల్ ను విజయవంతంగా నిర్వహించారు.



# రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి

- అన్నదాతలకు అండగా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి
- సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదే
- చిన్నకల్వల సింగిల్ విండో చైర్మన్ గౌరవెల్లి మురళీధర్ రావు
- 133వ మహాజన సభలో పీఏసీఎస్ నూతన పాలకవర్గ సభ్యులకు సన్మానం

**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా :**

రైతుల సంక్షేమానికి సహకార సంఘం కృషి చేస్తున్నట్లు చిన్నకల్వల సింగిల్ విండో చైర్మన్ గౌరవెల్లి మురళీధర్ రావు తెలిపారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సహకార సంఘం చైర్మన్ అధ్యక్షతన 133వ మహాజన సభ నిర్వహించారు.ఈ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు హాజరై మాట్లాడారు .ఈ సందర్భంగా 2025 2026కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.రైతుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామని పేర్కొన్నారు.సొసైటీ పరిధిలోని 8 గ్రామాల రైతులకు సహకార సంఘం ద్వారా అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.రైతులకు సకాలంలో రుణాలు,ఎరువులు, విత్తనాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.సహకార సంఘం సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి,పెద్దపల్లి జిల్లాలోనే రెండో స్థానంలో చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పేరుగాంచిందని స్పష్టం చేశారు.గత పాలకవర్గాలు తీసుకున్న నిర్ణయాలతో సహకార సంఘం చాలా అభివృద్ధి చెందిందన్నారు.సొసైటీ పరిధిలోని అన్ని గ్రామాలలో గోదాంలు నిర్మించి,అలాగే పెట్రోల్ పంపు నిర్మాణం కూడా చేపట్టి రైతులకు అండగా నిలిచారని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఏర్పడిన నుండి సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని గుర్తు చేశారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం...రైతు ప్రభుత్వమని,ఎల్లప్పుడూ రైతుల మేలు కోరుతుందన్నారు.రైతులు ముఖ్యంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని కోరారు. రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి,ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలన్నారు.వానాకాలం ప్రభుత్వం గుర్తించిన వరి పంట రకాలను సాగు చేసి రైతులు బోనస్, ప్రోత్సాహాలను పొందాలని సూచించారు.సాంప్రదాయ పంటలకు భిన్నంగా రైతులు లాభసాటిగా ఉండే ఆయిల్ ఫామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సహకార సంఘాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు.సొసైటీ పరిధిలోని రైతుల కోరిక మేరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సహకారంతో చిన్నకల్వలలో ఫంక్షన్ హాల్ నిర్మాణం ,చిన్నబొంకూర్ లో గోల్డ్ లోన్ లాకర్ సౌకర్యంతో పాటు మినీ మిల్క్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**పీఏసీఎస్ నూతన పాలకవర్గానికి ఘన సన్మానం..**

ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గౌరవెల్లి మురళీధర్ రావుకు,డైరెక్టర్లకు పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు రైతులకు చేరేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎలిగేడు సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్ రావు,కనుకుల సింగిల్ విండో చైర్మన్ చిలుక సతీష్,సర్పంచులు ఏరుకొండ స్రవంతి రమేష్ గౌడ్,సట్టు ఉత్తమకుమారి,మేకల పోశాలు, అట్ల కుమార్,అబ్బోజు కవిత బ్రహ్మాచారీ ,సహకార సంఘాల అసిస్టెంట్ రిజిస్టర్ ఎన్.వెంకటేశ్వర్లు,అనిల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పైడితల్లి,సీఈవో రమేష్,ఏఈవోలు ప్రశాంత్,రవితేజ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు పన్నాల రాములు,మండల రమేష్, గౌరవెల్లి విష్ణురావు,మామిడి లింగయ్యతో పాటు రైతులు, నాయకులు,కార్యకర్తలు,సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

- నివాళి అర్పించిన జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**



రామగిరి మండలం సెంటినరీ కాలనీలో రజక సంఘం అధ్యక్షుడు రాయమల్లు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాండ్ల మోహన్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ అబల కాదని,భూస్వాముల అరాచకాలను,నైజాం పన్నుల దోపిడీని ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కొనియాడారు.నైజాం సైనికులతో పోరాడి తన హక్కులను కాపాడుకున్న ఆమె పోరాటం అందరికీ ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు తులసి రామ్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ గంటా వెంకటరమణారెడ్డి, నాయకులు ములుమూరి శ్రీనివాస్, కాటం సత్యం, రజక సంఘం నాయకులు రాయమల్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందేలా పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- నీటి సరఫరా,విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి
- పాఠశాలల్లో హాజరు శాతం పెంచేలా బాధ్యత తీసుకోవాలి
- ఏఐ (ఎఐ) ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు అధునాతన బోధన
- వివిధ శాఖల పనితీరును సమీక్షించిన జిల్లా కలెక్టర్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. విద్య,తాగునీటి సరఫరా,పారిశుధ్యం మహిళా శిశుసంక్షేమం,ఎలక్ట్రిసిటీ,వ్యవసాయం,తదితర కీలక అంశాలపై అధికారులకు పలు సూచనలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.....అభివృద్ధి పనులు,మౌళిక వసతులు,నీటి సరఫరా,ఎలక్ట్రిసిటీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని,'విబిజీ రాంజీ' పథకం కింద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరు కావడం లేదని,విద్యార్థులు సరిగా హాజరు కాకపోవడం వల్ల ఉపాధ్యాయులకు బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సహాయంతో అడ్మిషన్ల సంఖ్య పెంచేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ సమస్య పరిష్కారానికి పేరెంట్స్,టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించాలని,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని,విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు.తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సపోర్టివ్‌గా ఉంటే,వారు మరింత ఉత్సాహంగా విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తారని పేర్కొన్నారు.

**అంగన్వాడీ కేంద్రాలు పోషకాహారం...**

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు,గర్భిణులు,బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని,ఆరోగ్యలక్ష్మి పథకం సేవలు సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం మండల కేంద్రంలోని పురాతన ఆరోగ్య కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ప్రామిక ఆరోగ్య కేంద్రం లోని సౌకర్యాల వైద్య సేవల గురించి పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీమాల,ఎంపీడీవో సురేందర్ కుమార్,తహసీల్దార్ రాపెల్లి రాముడు, మార్కెట్ కమిటీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి,సూపర్డెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ రంగు రవి, జూనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మి,టైపిస్టు లక్ష్మణ్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,మండల సర్పంచ్‌లు,వివిధ శాఖల అధికారులు,తదితరులు ,పాల్గొన్నారు.



# విషాదంలోనూ...వెలుగులు పంచారు

- తల్లి నేత్రాలను దానం చేసిన కుటుంబం
- అభినందించిన సదాశయ ఫౌండేషన్

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కన్నతల్లి మరణంతో తీరని విషాదంలో ఉన్న ఆ కుటుంబం,మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయం తీసుకుంది.కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన గుంపుల రాజమ్మ (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు.ఆమె నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు అంధులకు చూపునిచ్చేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు.రాజమ్మ నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని,ఆమె నేత్రాలు మరణానంతరం కూడా మరో ఇద్దరి కళ్లలో సజీవంగా ఈ లోకాన్ని చూస్తాయని సదాశయ ఫౌండేషన్ ముఖ్య ప్రతినిధి అరెపెల్లి రాజమౌళి కుటుంబ సభ్యులకు వివరించారు.దీంతో మృతురాలి భర్త పెద్దయ్య,కుమారులు-కోడళ్లు సారయ్య-రమాదేవి,అంజయ్య-లక్ష్మీ, రాయమల్లు-లత,మురళి-స్వప్న,తిరుపతి-శ్రీల, కుమార్తె,అల్లుడు మధునమ్మ-మమత-సతీష్ నేత్రదానానికి అంగీకారం తెలిపారు.కుటుంబ సభ్యుల అంగీకారంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో రాజమ్మ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు.

**విషాదంలోనూ ఆదర్శ నిర్ణయం...**

ఈ సందర్భంగా అరెపెల్లి రాజమౌళి మాట్లాడుతూ... తల్లిని కోల్పోయిన విషాదంలోనూ ఆమె నేత్రాలను దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయించుకోవడం గొప్ప మానవతా విలువలకు నిదర్శనమన్నారు.రాజమ్మ కుటుంబం గ్రామానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఈ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నేత్రదాతకు నివాళులర్పించారు.

**అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు**

కుటుంబ సభ్యుల ఆదర్శ నిర్ణయాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి,అధ్యక్షుడు టి.శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి,ప్రతినిధులు నూక రమేష్,లగిశెట్టి చంద్రమౌళి, అరెపెల్లి రాజమౌళి,భీష్మాచారి,వెల్దీ కవిత అనంతరాములు, అన్నపూర్ణ ,శశికళ,జ్యోతి, ఎల్. రాజమౌళి,కనకయ్య తదితరులు అభినందించారు. రాజమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**కాల్వ శ్రీరాంపూర్ ,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిల్ల గ్రామంలో దర్ముల రవి అధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి ఘననివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా యూత్ అధ్యక్షుడు దర్ముల రవి మాట్లాడుతూ... వీరనారి చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా ప్రకటించాలి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని అన్నారు.భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివి అని అన్నారు.తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత,సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి అని కొనియాడారు.చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని,ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఆమె ధీర చరిత్ర ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొంది ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య,మాజీ ఎంపిటిసి రావి సదానందం,మాజీ సర్పంచ్ అట్టికం శంకరయ్య మాజీ ఉప సర్పంచ్ ఇల్లందుల రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్ వార్డు సభ్యులు ఇల్లందుల శంకర్,కొత్తగట్టు కళ్యాణి మధు,తాండ్ర రమేష్, చిలుముల వినేష్,ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్,పోతరవేన మహేందర్, రజక సంఘం నాయకులు దబ్బేట సంపత్,శ్రీనివాస్, శ్రీకాంత్,రామ్మూర్తి,హరీష్, శివాజీ,భూమేష్,రమేష్, కనకయ్య,గ్రామ యువకులు అట్టికం అనిల్,మిట్టపల్లి శివ,మహేష్,శ్యాం బాబు, సురేష్,ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన వారికి పెన్షన్ అందేలా చూస్తా

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఇదులాపూర్ గ్రామంలో చేయూత పింఛన్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను మండలాధికారుల ఆధ్వర్యంలో గ్రామం లో ఇంటింటా లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి లత అశోక్ మాట్లాడుతూ... గ్రామంలో అర్హులైన వారికి పెన్షన్ అందేలా చూస్తా అన్నారు.ఈ కార్యక్రమంలో పరిశీలన అధికారి పశు వైద్య అధికారి శైలజ,గ్రామ కార్యదర్శి రాజు,కారోబార్ స్వామి,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో వెల్కమ్ పార్టీ వేడుకలు

**మంచిర్యాల, తెలంగాణ చౌరస్తా:**

స్థానిక శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో వెల్కమ్ పార్టీ వేడుకలు వేంపల్లి లోని మంచిర్యాల గార్డెన్ లో అంగరంగ వైభవంగా జరిగింది.ఇందులో పాల్గొన్నటువంటి సెకండ్,ఫైనల్ ఇయర్ విద్యార్థినీ,విద్యార్థులు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు స్నేహపూర్వకంగా ఇచ్చేటువంటి ఫ్రెషర్స్ పార్టీలో కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ పాల్గొని కళాశాలలో విద్యార్థులు లక్ష్యంతో చదవాలని ఆ విధంగా చదివిన వారు మాత్రమే జీవితంలో స్థిరపడతారని పేర్కొన్నారు.కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికి విద్యతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్,పర్సనాలిటీ డెవలప్మెంట్ మీద ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఒక్కరు ఏదో ఒక రంగంలో స్థిరపడాలని కోరారు.2026 లో కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటొలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పోటు మనోహర్ రెడ్డి,తనుగుల శ్రావణ్,ప్రిన్సిపాల్ అనిత ఠాగూర్,కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.





# నారాయణ ఇ-ఛాంప్స్ పాఠశాలలో వైభవంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

హయత్ నగర్ పరిధిలోని నారాయణ ఇఛాంప్స్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి పాఠశాల ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపల్ మానస, కోఆర్డినేటర్ దివ్య, వైస్ ప్రిన్సిపల్ కవిత ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు విచ్చేసిన గ్రాండ్ పేరెంట్స్ కి విద్యార్థులు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు,నాటకాలు, గేయాలు ప్రసంగాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.తమ నటన,మాటల ద్వారా పెద్దలపై ఉన్న ప్రేమానురాగాలను విద్యార్థులు చాటుకున్నారు.ఈ సందర్భంగా వయోధికుల కోసం పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా పలు రకాల ఆటల పోటీలను నిర్వహించగా, వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.తమ మనవళ్ళు,మనవరాళ్లతో కలిసి ఈ విధంగా రోజంతా ఆనందంగా గడపడం మర్చిపోలేని తీపి జ్ఞాపకమని,ఇటువంటి వేడుకలు నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి తాతయ్యలు, అమ్మమ్మలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

- సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్,తెలంగాణ చౌరస్తా:**

వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడలోని వినాయక సాగర్ వద్ద మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిమజ్జనానికి తరలివచ్చిన పలు గణేష్ విగ్రహాలకు ఆయన స్వాగతం పలికారు.అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు.నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించిన వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను,సిబ్బందిని ఎమ్మెల్యే సత్కరించారు.ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్, బాటసింగారం రైతు సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి జయపాల్ రెడ్డి,గండి చెరువు గ్రామ సర్పంచ్ జక్క రవీందర్ రెడ్డి,అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్,కావాడిపల్లి సర్పంచ్ కొలన్ ప్రసన్న రవీందర్ రెడ్డి,బలిజగూడ సర్పంచ్ మాధవి నవీన్,అనాజ్‌పూర్ సర్పంచ్ రాచపాక నవనీత మహేష్,ఇనామ్‌గూడా గ్రామ సర్పంచ్ దేశారం రాఘవేందర్ గౌడ్, గుంతపల్లి సర్పంచ్ అంతటి హేమలత జంగయ్య, చినరావిరాల సర్పంచ్ పబత్ బాలకిషన్ గౌడ్, జాఫర్ గూడ సర్పంచ్ ఎర్ర వెంకటేశ్ యాదవ్, పిగిలిపూర్ గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి,లష్కర్‌గూడా గ్రామ సర్పంచ్ అల్లే ఐలయ్య యాదవ్,మజీద్‌పూర్ సర్పంచ్ మేడిపల్లి ప్రియా చంద్రశేఖర్ గౌడ్,బాటసింగారం సర్పంచ్ ఎర్రవెల్లి గౌరీ శంకర్ మాజీ ఎంపిపి బుర్ర రేఖమహేందర్ గౌడ్, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పలువురు ప్రభుత్వ అధికారులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# వినూత్నమైన ఆలోచనలతోనే విద్యార్థులలో ఆత్మవిశ్వాసం

- నారాయణ పాఠశాల డెలిబరేషన్ సదస్సులో
- ప్రిన్సిపల్: లావణ్య రెడ్డి

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

హయత్‌నగర్ నారాయణ పాఠశాలలో విద్యార్థులు డెలిబరేషన్ కార్యక్రమాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రస్తుత అంశాలు, విద్యావిధానాలు, సామాజిక బాధ్యతలపై లోతైన చర్చలు జరిపి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.విద్యార్థులు కనబరిచిన విశ్లేషణాత్మక నైపుణ్యాలు,స్పష్టమైన భావవ్యక్తీకరణ ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్యరెడ్డి మాట్లాడుతూ..విద్యార్థులను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా వారిలో విమర్శనాత్మక ఆలోచనా ధోరణి, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఇటువంటి వేదికలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తాయని పేర్కొన్నారు.ఈ వేడుకలో జి.ఎమ్. గోపాల్‌రెడ్డి,ఆర్.ఎన్.డి. శివరంజని,ఎ.జి.ఎమ్. రవీంద్రబాబు,సి.ఓ. సృజన్,ఎ.డి. మంజులలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం వివిధ చర్చల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



# వీరనారి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు
- మోత్కూరి రవీంద్రాచారి, ముద్దసాని సురేష్

**తొర్రూరు, తెలంగాణ చౌరస్తా:**

వీరనారి అయిలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మోత్కూరి రవీంద్రాచారి, ముద్దసాని సురేష్ లు అన్నారు.కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ కమిటీల ఆధ్వర్యంలో శనివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ... చాకలి ఐలమ్మను గుర్తింపు పొందిన తెలం గాణ ఉద్యమకారిణి, తొలి భూపోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన ధైర్యశాలిగా కొనియాడారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం విముక్తి కోసం ఆమె చేసిన పోరాటాలు,ధైర్యసాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.నాటి రాచరిక పాలనలో, రాష్ట్ర రైతాంగ న్యాయమైన హక్కుల కోసం,ధిక్కార స్వరం వినిపించిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న సబ్బండ కులాల ఆత్మగౌరవ ప్రతీక ఐలమ్మ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు,10వ వార్డు కౌన్సిలర్ ముద్దసాని సురేష్, మార్కెట్ డైరెక్టర్ అచ్చిరెడ్డి,జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ మంగళపల్లి యాకయ్య,సీనియర్ నాయకులు గుండాల నరసయ్య, చిత్తలూరి శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షుడు బసనబోయిన మహేష్ యాదవ్, నాయకులు ఎడ్ల వెంకటరెడ్డి, యనమాల శ్రీనివాస్,జంజరాల మనోహర్,కర్ర అశోక్ రెడ్డి,నల్లపు రాజు,ఎనగందుల శ్రీనివాస్,మంగళపల్లి స్వామి, ఫైండ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**

తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 కబడ్డీ క్రీడా పోటీలు నూతనకల్ మండలం వెంకేపల్లి గ్రామంలోని కేబీఆర్ఆర్ఎం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, నూతనకల్ మండల పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఇమ్మడి జయకుమార్, ఉపసర్పంచ్ పాల్వాయి నాగయ్య, మండల ఎస్‌జీఎఫ్ చైర్మన్, ఎంఈఓ రాములు నాయక్, ఎస్ఎస్ఏ ప్లానింగ్ కోఆర్డినేటర్ నెల్సన్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డి. శివయ్య, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అలాగే పాఠశాల మాజీ కోఆప్షన్ సభ్యులు తోను కునూరి సైదులు గౌడ్, ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యాదయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు కుంట అనిత, పవన్ రెడ్డి, మాతంగి సౌందర్య, కుమారస్వామి, మర్రి కవిత, బాలయ్య, బీవైసీ యూత్ అధ్యక్షులు సందీప్, ఏజేసీవైసీ అధ్యక్షులు పర్శరాములు, శివాజీ యూత్ అధ్యక్షులు సదా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు సమత, కల్పన, చూడి ఉపేందర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, యాకయ్య, అంబేద్కర్‌తో పాటు ఉపాధ్యాయులు శ్రీశైలం, షాబుద్దీన్, అజమాతుల్లా, రమేష్, శ్రీదేవి, ధనమ్మ, వీరన్న, సుధాకర్ తదితరులు సహకరించారు.క్రీడా పోటీలకు అవసరమైన ఏర్పాట్లలో దాతలు యనగందుల సోమయ్య, మాతంగి రాములు, కట్టాపోలోజు శ్రీను, మిర్యాల ప్రవీణ్, జటంగి సైదులు, కుంట రాంరెడ్డి (టెంట్), కుమారస్వామి (ఫొటో, వీడియో), బీవైసీ యూత్ సభ్యులు (భోజన ఏర్పాట్లు), డాక్టర్ శివరెడ్డి, సైరెడ్డి వినోద్ రెడ్డి, దామెర్ల సైదులు, అశోక్ తదితరులు తమ వంతు సహకారం అందించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రీడాకారులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మగౌరవానికి ప్రతీకగా చాకలి ఐలమ్మ

- తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి
- ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న
- మండల కేంద్రంలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలో ఆమె విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. విగ్రహ దాతలు తీగల కరుణశ్రీ, తీగల గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో ధైర్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చూపిన బాటను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు.చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని నూతనకల్ మండల కేంద్రంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి, జిల్లా అధ్యక్షుడు వీరమల్ల వెంకన్న, మండల నాయకులు మైలారపు ఉపలయ్య, వీరమల్ల శ్రీను, నర్సయ్య, వీరమల్ల భాను వంశీ, వెంకటేష్, యాదగిరి, శ్రీకాంత్, నెల్లుట్ల మహేష్, రాము, వెంకన్న, యువజన కాంగ్రెస్ నాయకులు పసుల అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ మహాసభలకు భారీగా కదలిరండి

- రైతు సమస్యలపై గళమెత్తిన ట్రాక్టర్ ర్యాలీ
- రైతు–కూలీ సమస్యలపై ఐక్య పోరాటానికి పిలుపు

**నూతనకల్,తెలంగాణ చౌరస్తా:**



ఖమ్మం పట్టణంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నూతనకల్ మండల కేంద్రంతో పాటు చిల్పకుంట్ల గ్రామంలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకు ఐక్య పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, ఏఐకేఎంఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నరైతాంగ విధానాలపై రైతులు, కూలీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చే విధానాలను అవలంబిస్తున్నాయని నాయకులు విమర్శించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన నూతన విధానాల వల్ల చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**సకాలంలో ఎరువులు అందక రైతుల ఇబ్బందులు**

యూరియా, పొటాష్ తదితర ఎరువుల సరఫరాకు సంబంధించి తీసుకువస్తున్న నూతన విధానాలు, యాప్‌ల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు అన్నారు. పంటలకు ఎరువులు అవసరమైన సమయంలోనే అందాల్సి ఉండగా, సకాలంలో సరఫరా కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.మరోవైపు వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతింటున్నాయని, పెట్టుబడులు పెట్టి కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు.

**రైతు–కూలీ సమస్యలపై జాతీయ మహాసభల్లో చర్చ**

దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయ రంగ భవిష్యత్తు, రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు నాయకులు తెలిపారు.ఈ మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చిల్పకుంట్ల గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మున్న అశోక్, భూపాల్ రెడ్డి, గడ్డం జానయ్య, శ్రీను, రాము, కూసు ఉప్పలయ్య, బోలగాని రమేష్, బిక్కి రవి, జాతంగి సతీష్, సత్తయ్య, లింగయ్య, రాజు, మహేష్, గణేష్, కూసు వెంకన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ ఏపీఎం, సీసీ ఏకపక్ష నిర్ణయాలపై మహిళా సంఘాల ఆగ్రహం

- కోరం లేకుండానే కొత్త సంఘబంధం ఎంపిక చేశారంటూ ఆరోపణలు..
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్

**తుంగతుర్తి,తెలంగాణచౌరస్తా:**



తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామంలో ఐకేపీ పరిధిలో సంఘబంధం ఎంపిక వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఐకేపీ ఏపీఎం, సీసీ ఏకపక్షంగా వ్యవహరించి, నిబంధనలకు విరుద్ధంగా కొత్త సంఘబంధం సభ్యులను ఎంపిక చేశారని గ్రామంలోని మహిళా సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. గానుగుబండ గ్రామంలో మొత్తం 37 సంఘబంధాలు ఉన్నాయని మహిళా సంఘాల ప్రతినిధులు తెలిపారు. గత 11032026న గ్రామ సంఘబంధాన్ని ఎంపిక చేశామని, దాని కాలపరిమితి కేవలం ఆరు నెలలు మాత్రమే పూర్తయిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న సంఘబంధం సభ్యులకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఏపీఎం యాదమ్మ, సీసీ రమేష్ ఆధ్వర్యంలో గ్రామ సంఘం సమావేశం ఏర్పాటు చేసి కొత్త సభ్యుల ఎంపిక చేపట్టారని ఆరోపించారు.

***2/3 మెజార్టీ లేకుండానే ఎంపిక ఎలా?***

సాధారణ సమావేశంగా పేర్కొంటూ అదే రోజు ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించి, కొంతమంది మహిళా సంఘాల సభ్యుల పేర్లు మాత్రమే నమోదు చేసుకుని కొత్త సభ్యులను ఎంపిక చేశారని మహిళా సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా సమావేశానికి హాజరైన వారిలో కొందరు సంఘాల్లో సభ్యులుగా లేని వారి పేర్లను కూడా నమోదు చేసినట్లు వారు పేర్కొన్నారు.సంఘబంధం సభ్యుల ఎంపికకు అవసరమైన 2/3 మెజార్టీ లేకుండానే నిర్ణయం తీసుకున్నారని, తగిన కోరం కూడా లేకపోయినప్పటికీ ఎంపిక ప్రక్రియను కొనసాగించడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏపీఎంను ప్రశ్నించగా, “నా ఇష్టం.. మెజార్టీతో నాకు సంబంధం లేదు” అన్నట్లుగా మాట్లాడారని మహిళా సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. అధికారులే నిబంధనలను పాటించాల్సిన పరిస్థితిలో, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు.

***కలెక్టర్ జోక్యం చేసుకోవాలి***

సంఘబంధం ఎంపిక ప్రక్రియలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గ్రామంలోని అన్ని మహిళా సంఘాల సమక్షంలో, నిబంధనల ప్రకారం, పూర్తి కోరం మరియు అవసరమైన మెజార్టీతో కొత్త సంఘబంధం సభ్యులను ఎంపిక చేయాలని కోరారు.అధికారులపై వచ్చిన ఆరోపణలు వాస్తవమా కాదా అన్నది పూర్తిస్థాయి విచారణలో తేల్చాలని, అప్పటివరకు వివాదాస్పదంగా మారిన ఎంపిక ప్రక్రియను పునఃపరిశీలించాలని మహిళా సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మహిళా సంఘాల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య పద్ధతులు, నిబంధనల అమలు తప్పనిసరిగా ఉండాలని వారు స్పష్టం చేశారు.



# మధ్యాహ్న భోజన పతకాన్ని అక్షయపాత్రకు అప్పగించొద్దు

- సీఐటీయూ ఆధ్వర్యంలో
- ఎంఈఓ కార్యాలయం ఎదుట వంట కార్మికుల ధర్నా

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**

పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతలను అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అబ్దుల్లాపూర్ మెట్ ఎంఈఓ కార్యాలయం ఎదుట వంట కార్మికులు నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ..గడిచిన 25 ఏళ్లుగా డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు ఎటువంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు వంట వండి సేవ అందిస్తున్నారని తెలిపారు.ప్రభుత్వం నుంచి నెలల తరబడి బిల్లులు రాకపోయినా, అప్పులు చేసి మరీ పిల్లలకు భోజనం పెట్టి ప్రభుత్వ గౌరవాన్ని కాపాడారని గుర్తుచేశారు. నేడు వారి ఉపాధిని దెబ్బతీస్తూ,కమిషన్లకు ఆశపడి అక్షయపాత్ర సంస్థకు ఈ బాధ్యతలను కట్టబెట్టడం అన్యాయమన్నారు. కాబట్టి పాత పద్ధతిలోనే స్థానిక కార్మికుల చేతే వంట చేయించాలని డిమాండ్ చేశారు.

**ఎంఈఓ కార్యాలయానికి తాళం..నాయకుల ఆగ్రహం**

ధర్నా కార్యక్రమం గురించిన సమాచారాన్ని ముందే అందించినప్పటికీ,ఎంఈఓ విధులకు హాజరుకాకుండా ఆఫీసుకు తాళం వేసి నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి వెంటనే పర్మనెంట్ ఎంఈఓను నియమించాలని,బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన నాన్‌టీచింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, పరకాల బాలరాజ్, మధ్యాహ్న భోజన వంట కార్మికులు పుష్పలత,నాగరాణి,నవనీత,లక్ష్మమ్మ,రంగమ్మ,స్వరూప, నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తాళ్లసింగారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు
- తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి
- నూతనకల్ మండల పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి





**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**

నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, నూతనకల్ మండల పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ జటంగి నాగలక్ష్మి గణేష్‌యాదవ్ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాత దొడ్డు బియ్యానికి బదులుగా ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అర్హులైన పేద కుటుంబాలందరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.స్మార్ట్ రేషన్ కార్డు ద్వారా కుటుంబంలోని ప్రతి సభ్యునికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మరికంటి అనసూర్య, మరికంటి అంబేద్కర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, బోల్క సైదులు యాదవ్, మద్దెల సురేందర్, బొల్లెపల్లి సాయి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ అధికారులు, రేషన్ డీలర్ సంజీవ, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# ఐలమ్మ విగ్రహావిష్కరణతో మార్మోగిన అశ్వారావుపేట

- హక్కుల పోరాటానికి ఐలమ్మ జీవితమే మార్గదర్శకం
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- సామాజిక న్యాయానికి ఐలమ్మ పోరాటం స్ఫూర్తి
- సీపీఐ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య
- విజయవంతంగా ముగిసిన విగ్రహావిష్కరణ వేడుకలు

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ వీరనారి, రజక సమాజం ఆత్మగౌరవానికి ప్రతీక అయిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అశ్వారావుపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో రింగ్ రోడ్డు సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని శాసనసభ్యులు జారే ఆదినారాయణ పూలమాలలు వేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం ప్రతినిధులు, మహిళలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో అశ్వారావుపేట పరిసరాలు కోలాహలంగా మారాయి. విగ్రహావిష్కరణ అనంతరం పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. ఐలమ్మ ఏ ఒక్క కులానికో, వర్గానికో పరిమితమైన మహిళ కాదని, తెలంగాణ ప్రజల ధైర్యం, ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపమని కొనియాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన వీరోచిత పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళలు కూడా సామాజిక మార్పులో కీలక పాత్ర పోషించగలరని ఆనాడే నిరూపించిన గొప్ప పోరాట యోధురాలని పేర్కొన్నారు. సమాజంలో అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకునే తత్వాన్ని ఐలమ్మ జీవితం నుంచి నేర్చుకోవాలని, ముఖ్యంగా యువత ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.సీపీఐ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. దొరల పెత్తందారీతనం, అణచివేతకు వ్యతిరేకంగా సామాన్య కుటుంబం నుంచి వచ్చి గొంతెత్తిన ప్రజా వీరనారి ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో ఆమె సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఐలమ్మ చరిత్రను పాఠ్యాంశాల ద్వారా భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రింగ్ రోడ్డు సెంటర్‌లో విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా ఆమె పోరాట స్ఫూర్తి నిరంతరం ప్రజల్లో చైతన్యాన్ని రగిలిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, కాంగ్రెస్ నాయకులు చిన్నంశెట్టి సత్యనారాయణ, తుమ్మ రాంబాబు, స్థానిక ఎమ్మార్వో, ఎస్సై టి. యయాతి రాజుతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రజక సంఘం నాయకులు బుక్కూరి బుజ్జిబాబు, గుమ్మడి ఆదినారాయణ, గాడిచర్ల శ్రీను, పల్లంటి రామ్ సాయి, ఇతర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఏర్పాట్లు అద్భుతంగా సాగాయి. భారీ సంఖ్యలో పాల్గొన్న రజక మహిళలు ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. తమ వీరనారి విగ్రహం పట్టణంలో కొలువుదీరడం పట్ల రజక సమాజం మరియు స్థానిక ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.



# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలి

- నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్



**శాలిగౌరారం,తెలంగాణ చౌరస్తా:**

కేంద్ర ఎన్నికల సంఘంలో ఏకపక్ష నిర్ణయాలతో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ అన్నారు. శనివారం వేముల గోపీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ముఖ్యమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా ఉన్న జ్ఞానేష్ కుమార్ ,ఇద్దరు ఎలక్షన్ కమిషనర్ కాదని ఏకపక్ష నిర్ణయాలతో ఒక పార్టీకి ఏజెంట్ గా మారారని ఆరోపించారు. ఆయన ఏకపక్ష నిర్ణయాలపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సర్ పేరుతో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరాలు వచ్చాయన్నారు. ఇవి ఏమి పట్టించుకోకుండా ముందుకు పోవడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ఫారం 6 మార్పులు ఓటర్ల జాబితా డేటా కేంద్రీకరణపై ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేసిన ఏకపక్షంగా నిర్ణయాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల వ్యవస్థపైన చిత్తశుద్ధి ఉంటే జ్ఞానేష్ కుమార్ ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్క ఓటును కాపాడవలసిన బాధ్యత ఉందని ఓటర్లంతా అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమన్నారు. అలాంటి ఓటును అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలన్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుఅశోక్ రెడ్డి





**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**

దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల ఓటు చోరీకి పాల్పడిన కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ చిక్కడపల్లిలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుకి అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడి హక్కు అని, పౌరుల హక్కులను కాపాడవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. అలాంటి బాధ్యతాయుతమైన ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా బాధ్యత వహిస్తున్న జ్ఞానేష్ కుమార్ భారత రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వంతో కుమ్మక్కై ఎన్నికల కమిషన్ లో సభ్యులుగా ఉన్న సుఖ్ బీర్ సింగ్ సందు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు చెప్పిన జ్ఞానేష్ కుమార్ వాటిని ఖాతార్ చేయకుండా నిరంకుశత్వంతో వ్యవహరించాడన్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటా బేస్ ,ఎన్నికల నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్వేర్ సంబంధించిన అంశాలపై ఇద్దరు సభ్యులు అభ్యంతరాలు చెప్పిన వాటిని పక్కనపెట్టి కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల ఏజెంటుగా వ్యవహరించిన జ్ఞానేశ్ కుమార్ కు ఎన్నికల చీఫ్ కమిషనర్ గా కొనసాగే అర్హత లేదన్నారు ఆయనను వెంటనే ఆ పదవి నుండి కేంద్ర ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను ప్రజాస్వామ్య పద్ధతిలో దాని కార్యకలాపాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గతంలో సూచించిన విధంగా ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా ఎన్నికల కమిషనర్లను నియమించే విధానాన్ని తీసుకురావాలని ప్రస్తుతం కొనసాగుతున్న విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఆంజనేయులు,మనోజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు



# పూరీలో అశ్వారావుపేట బిఆర్ఎస్ పూజలు

- కేసీఆర్ సీఎం కావాలని ప్రార్థనలు
- పూరీ జగన్నాథునికి బిఆర్ఎస్ మొక్కులు
- తెలంగాణ సుభిక్షం కోరుతూ అర్చనలు
- పూరీ క్షేత్రంలో గులాబీ శ్రేణులు

**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**

ప్రసిద్ధ పవిత్ర పుణ్యక్షేత్రమైన ఒడిశాలోని పూరీ శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బిఆర్ఎస్ మహిళా నాయకులు డాక్టర్ ఉదయజ్యోతి, కాసాని పద్మల నేతృత్వంలో అశ్వారావుపేట నుంచి వెళ్లిన పార్టీ శ్రేణులు శ్రీ జగన్నాథ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తమ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని పూరీ జగన్నాథుని పాదాల చెంత ప్రార్థించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పూరీ జగన్నాథ స్వామివారి దివ్య ఆశీస్సులతో తెలంగాణ గడ్డపై మళ్లీ గులాబీ జెండా సగర్వంగా ఎగరాలని, బిఆర్ఎస్ పాలనతోనే రాష్ట్రానికి తగిన ప్రాధాన్యత దక్కుతుందని ఆకాంక్షించారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, భోగభాగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండి, రైతన్నలకు పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. రైతాంగం సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, పరిశ్రమలు, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలురిగి తెలంగాణ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని స్వామివారిని కోరుకున్నట్లు వివరించారు.ఈ పూజా కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాసాని చంద్రమోహన్, డాక్టర్ భూక్యా ప్రసాద్, గుడవార్తి వెంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి, సంపూర్ణ, ఆరేపల్లి గోవింద్, మోటూరి మోహన్, కునసోతు నవీన్లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మండల స్థాయి సమీక్షా సమావేశంలో ప్రగతి నివేదన

- ముఖ్య అతిథిగా హాజరైన
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం







**రామన్నపేట,తెలంగాణ చౌరస్తా**

రామన్నపేట మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపిడివో ఆఫీస్ నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర గేయాలపనతో మొదలై వివిధ శాఖల ప్రగతి నివేదికలతో ముగిసింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమెల్యే వేముల వీరేశం హాజరయ్యారు.ప్రభుత్వ ప్రత్యేక అధికారి ఎమ్మెల్యే వేముల వీరేశంకు పూలబోకే అందించి శాలువతో సత్కరించారు. అనంతరం విప్ వీరేశం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు.పిల్లాయి పల్లి,ధర్మారెడ్డి కాలువ పనులు వేగవంతం చేసి నీరందించే దిశగా చర్యలు చేపట్టామన్నారు.అదే విధంగా రామన్నపేట ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. చిట్యాల భువనగిరి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశాం త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.గత ప్రభుత్వం శిలపలకాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినట్టు గొప్పలకు పోయి ప్రజలను మోసం చేశారని విమర్శించారు.మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నారు.రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.మండల స్పెషల్ ఆఫీసర్ గా హాజరైన మైనింగ్ ఏడీ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు సూచించిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఎంఆర్వో లాల్ బహదూర్ మాట్లాడుతూ వంద సంవత్సరాల తర్వాత శాటిలైట్ అనుసంధానంగా భూముల సర్వే ప్రక్రియ చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రామన్నపేట మండలలో నాలుగు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు అందులో భాగంగానే ప్రస్తుతం నిదానపల్లి గ్రామంలో సర్వే కొనసగుతుందన్నారు.ఓట్ల గుర్తింపు కోసం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నోటీసులు అందిన వారు వెంటనే సంబంధించిన డాక్యుమెంట్ లు సమర్పించాలని కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఏదైనా డిగ్రీ పూర్తయిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం లభించనుంది అని తెలిపారు.స్మార్ట్ రేషన్ కార్డులు మొదటగా రామన్నపేట మండలంలో అనిదించామన్నారు. పిడుగు పాటుతో గేదెలు చనిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇన్సురెన్స్ లపై అవగాహన కల్పించాలని వెటర్నరీ అధికారులకు సూచించారు.ఎంపీడీఓ రాములు మాట్లాడుతూ ఒంటరి మహిళా,వృద్ధాప్య,వికలాంగుల పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియలో సర్పంచులు గ్రామ కార్యదర్శులు సహకరించాలని కోరారు.

సీపీఎం సర్పంచులు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వీరేశంకు రామన్నపేట అమ్మనబోల్ నూతన రోడ్డు నిర్మాణం కోసం వినతి పత్రం అందించారు.వివిధ గ్రామాల సర్పంచులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులను ప్రశ్నించి సమ న్యాయం పాటించాలని కోరారు.ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువుల ఆక్రమణలను విస్మరిస్తూ,అనధికారిక,తప్పుడు సమాచారంతో నోటీసులు ఇస్తున్నారని నిర్నెముల సర్పంచ్ గోపాల్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీనికి ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు విషయంపై స్పష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు.తప్పుడు ఆరోపణలతో నోటీసులు జారీ చేస్తే పరువునష్టం దావాను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.రోడ్లు భవనాల శాఖ ఏ.ఈ డ్యూటీ విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రభుత్వం దృష్టికి సమస్యలు తేవడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు పంచాయతీ రాజ్ శాఖ, ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో రోడ్లు రెండు చొప్పున మంజూరు అయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.ప్రజా ప్రతినిధులు తమ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి,ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని అధికారులతో గొడవ పడకూడదని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ,ఉద్యానవనశాఖ,వసతి గృహాల,ఐసీడీఎస్,వ్యవసాయ,మెడికల్ అధికారులు, హౌసింగ్ ఏ ఈ,విద్యుత్ శాఖ ఏ ఈ,మిషన్ భగీరథ,అటవీ,ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ అధికారులు పాల్గొని ప్రగతి నివేదిక సమర్పించారు.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న జగన్మోహన్,గంగుల రాజిరెడ్డి,కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి ,టి పీసీసీ స్పోక్స్ పర్సన్ మేడి రవిచంద్ర,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జమీల్,జెల్ల వెంకటేష్,అక్రం తదితరులు పాల్గొన్నారు.





# వార్డు మెంబర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

- వార్డుమెంబర్స్ ఫోరం నియోజకవర్గ కో- ఇన్‌చార్జిగా తీగల అశోక్

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**

వార్డు మెంబర్లకు గౌరవ వేతనం అందించడంతో పాటు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై ఉపసర్పంచుల పేర్లను సైతం చేర్చాలని తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి తప్పెట్ల మోహన్ డిమాండ్ చేశారు.తెలంగాణ వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు, ఫౌండర్ నాగవెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ఫోరం ఆధ్వర్యంలో జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన తీగల అశోక్‌ను పెద్దపల్లి నియోజకవర్గ కోఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జిల్లా ఇన్‌చార్జి తప్పెట్ల మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అశోక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తప్పెట్ల మోహన్ మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని వార్డు మెంబర్లను సమన్వయం చేసుకుంటూ ఏకతాటిపైకి తీసుకురావాలని అశోక్‌కు సూచించారు. వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర స్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి హక్కుల సాధన కోసం ఫోరం తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. వార్డు మెంబర్లకు గౌరవ వేతనం, రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉపసర్పంచుల పేర్లను కూడా చేర్చాలని ఆయన కోరారు. నూతనంగా నియమితులైన పెద్దపల్లి నియోజకవర్గ కోఇన్‌చార్జి తీగల అశోక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షురాలు, ఫౌండర్ నాగవెల్లి జ్యోతి మహేష్, జిల్లా ఇన్‌చార్జి తప్పెట్ల మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని వార్డు మెంబర్లను సమన్వయం చేసుకుంటూ వారి సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఇన్‌చార్జి రాయచోటి స్వరూప, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ ఉదయ్ కుమార్, గుర్రం రాజేశం, కల్లేపల్లి మహేష్, చెన్నమల నరేష్ తదితరులు పాల్గొన్నారు.